అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బెల్లంకొండ: రోడ్డు పక్కన పొదల్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ కె.అమీర్ వివరాల మేరకు.. మృతుడు మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన వర్ల ప్రసాద్ (50) అని పేర్కొన్నారు. సుమారుగా రాత్రి 8 గంటల సమయంలో బెల్లంకొండ వైపు నుంచి బైక్‌పై వస్తున్న కొందరు మన్నెసుల్తాన్‌పాలెం సమీపంలో చప్టా దాటిన తరువాత రోడ్డు పక్కనే ఉన్న చెట్లలో తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని గుర్తించారు. దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. పక్కనే బైక్ కూడా పడిపోయి ఉండడంతో ప్రమాదం జరిగి ఉంటుందని గమనించి పోలీసులతో పాటుగా గ్రామస్తులకు సమాచారం తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు మృతుడు గ్రామానికి చెందిన ప్రసాద్‌గా గుర్తించారు. కాగా ప్రసాద్ పాపాయపాలెం వెళ్లి అక్కడ నుంచి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ బైక్ పై నుంచి పడిపోయాడా, లేదా ఎవరైనా వాహనంతో ఢీకొట్టి వెళ్లి పోయారా అనే అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అమీర్ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదమా లేదా ఎవరైన ఢీకొట్టి వెళ్లిపోయారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.



రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న ప్రసాద్ మృతదేహం

రెంటపాళ్లలో కంటి వైద్య శిబిరం

సత్తెనపల్లి: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పినట్లుగా శారీరకంగా ఎంత బలంగా ఉన్నప్పటికీ కంటిచూపు సరిగ్గా లేనిదే జీవనం కష్టసాధ్యమని ప్రముఖ పల్మనాలనిస్ట్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. రెంటపాళ్ల గ్రామానికి చెందిన కట్టెకోట శ్రీనివాసరావు కుమారుడు కాశీ చైతన్య ఆర్థిక సహకారంతో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఆదివారం గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామీణ పేద వృద్ధులకు ఉచితంగా శుక్లాలకు శస్త్ర చికిత్సలు చేయించడంతో కట్టెకోట శ్రీనివాసరావు, కాశీ చైతన్య చూపిస్తున్న చొరవను ప్రశంసించారు. శంకర కంటి ఆసుపత్రి ప్రతినిధి సైదులు రోగులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. తవిటి భావనారాయణ, ఫ్రెండ్స్ సంస్థ ప్రతినిధి తోట ఆంజనేయులు అతిథులుగా విచ్చేశారు. డాక్టర్ రూతూజ, డాక్టర్ ఆకాంక్ష వైద్యసేవలు అందించారు. శిబిరంలో 93 మంది రోగులు హాజరవగా 50 మందికి శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. అర్హులైన వీరందరికీ రవాణా సౌకర్యంతో సహా ఉచిత వైద్యం కూడా అందించి తిరిగి ఇంటికి వచ్చు వరకు తామే బాధ్యత తీసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోట శ్రీనివాసరావు, మారిసెట్టి రామసైదులు, మారిసెట్టి సుబ్బారావు, కారుమంచి గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కోడి పందేలపై దాడులు

చిలకలూరిపేట టౌన్: పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం శివారులో కోడి పందేలపై అర్బన్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పట్టణ ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాలు.. దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు పందెపు కోళ్లు, రూ.12,520 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బొప్పూడిలో..

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి పొలాలలో పేకాట స్థావరాలపై రూరల్ ఎస్‌ఐ ఎస్.రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాటాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వీరి నుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలి

నరసరావుపేట: డివిజన్ పరిధిలో వినాయక మండపాలు పెట్టే వారందరూ పోలీస్‌శాఖ పర్మిషన్‌తో పాటు విద్యుత్ శాఖ పర్మిషన్ కూడా తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపం ఉన్న స్టేజ్, విద్యుత్ పరికరాలన్నిటికీ తగిన ఎర్తింగ్ చేసుకొని విద్యుత్ వైర్లకు జాయింట్‌లు ఉంటే వాటికి తగిన ఇన్సులేషన్ చేసుకుని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ వారిదేనని స్పష్టం చేశారు. మండపం వద్ద ప్రతి ఒక్క భక్తుడికి ఎటువంటి హాని జరగకుండా చూసుకోవాలని, ప్రమాదం జరిగితే కమిటీ వారే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.




































మీ కోసం..మీ శంకరన్న ఉన్నాడు..

- వేల్పూరులో 'మన కోసం – మన శంకరన్న' కార్యక్రమం
- 98 మందికి నివేశన స్థల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నంబూరు


నివేశన స్థల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: మన కోసం – మన శంకరన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామ సభ నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించిన తర్వాతే మళ్లీ గ్రామానికి వస్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇంటి నివేశన స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ స్తంభాలు వేయడం, అర్హతున్నా.. సంక్షేమ పథకాలు అందడం లేదనే వినతులు, దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గ్రామస్తులు తీసుకొచ్చిన ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే నోట్ చేసుకున్నారు. గ్రామంలో సర్వే నంబరు 173లో 3.20ఎకరాల భూమిని సేకరించి 98 మందికి సెంటున్నర చొప్పున నివేశన స్థలాలను ఆయన పంపిణీ చేశారు. 50 మందికి పింఛన్లు మంజూరు చేశామని, రూ.365లక్షలతో 31 అంతర్గత రోడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే నంబూరు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను పది రోజుల్లో పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారి విధానం కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. సమస్యలన్నింటిని పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, తనను తిరిగి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శంకరరావు కోరారు.

ముందస్తు జన్మదినోత్సవాలు..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం తన జన్మదినోత్సవం జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ కాలనీవాసులు కేక్ కట్ చేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలతో సత్కరించారు. శిఖారాజారావు వంద మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి, ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, గ్రామ పార్టీ కన్వీనర్ కోట నాగేశ్వరరావు, వేల్పూరు, అచ్చంపేట పీఏసీఎస్ చైర్మన్లు రావెళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శంకరరావు జన్మదిన వేడుకులు

పెదకూరపాడు: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదిన వేడుకులు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయం నందు ఉదయం శంకరన్న టీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. అనంతరం పలు సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేక్ కటింగ్ అనంతరం వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రొంపిచర్లలో పారిశుద్ధ్య పనులు

రొంపిచర్ల: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు ఆదివారం చేపట్టారు. ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించనున్న పారిశుద్ధ్య మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో గోగులపాడురోడ్డులోని ఇళ్ల ముందు సైడ్ కాలువలలో పూడిక తీత పనులు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి పాల్గొన్నారు.



ఊపిరితిత్తుల వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నంద్యాల రాంప్రసాద్‌రెడ్డి

నకరికల్లు: ఊపిరితిత్తుల సమస్యలు దీర్ఘకాలిక వ్యాధిగా మారకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని పల్మనాలజీ వైద్యనిపుణులు డాక్టర్ నంద్యాల రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నరసరావుపేట నంద్యాల హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపై వైద్యులకు సీజనల్ వ్యాధులపై ఆదివారం నకరికల్లులో అవగాహన సదస్సు నిర్వహించారు. దుమ్ముతో కూడిన పనులు చేసే వారికి ఎలర్జీ, ఆస్తమా వచ్చే ప్రమాదముంటుందన్నారు. ఊపిరితిత్తులకు ఎలర్జీ ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకుంటే సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. నంద్యాల హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించే బ్రాంకో స్కోపి లాంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రాంకోస్కోపి ద్వారా ఊపిరితిత్తులలో ఉంటే వ్యాధిమూలాలు గుర్తించడమే కాక కణుతులు తొలగించే సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ నంద్యాల రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేరళ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మేడం రామచౌడారెడ్డి, యూనియన్ నాయకులు షేక్.సైదా, సరికొండ అంజంరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే నంబూరు జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే శంకరరావుకు కేక్ తినిపిస్తున్న నేతలు


చీరలు అందచేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


క్రోసూరు: వైఎస్సార్ సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదినం ముందస్తు వేడుకలు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీశ్రేణులు ఏర్పాటు చేసిన 57 కిలోల భారీ కేక్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కట్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ ఖాదర్, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ గఫూర్, వేణుగోపాలరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, దుగ్గి ఏడుకొండలు, గార్లపాటిదాసు, అనుముల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.

చీరలు, పండ్లు పంపిణీ

క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు పేద మహిళలకు చీరలు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో పాస్టర్ రెవ. మాచర్ల సుందరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు చేశారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 50 మంది పేద మహిళలకు చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దుగ్గి ఏడుకొండలు, జెడ్పీ పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ పందిటి వీరయ్య, చిల్కా జీవయ్య పాల్గొన్నారు.







తెలంగాణ మద్యం స్వాధీనం



పెదకూరపాడు: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం బాటిళ్లను అమరావతి మండలం ధరణికోట పవర్ ప్లాంట్ వద్ద ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఎస్ఐ ఫణికుమార్ వివరాల మేరకు.. శనివారం ఇంటిలిజెన్సీ అడిషన్ ఎస్పీ బృందం, పెదకూరపాడు ఎస్ఈబీ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ధరణికోట గ్రామానికి చెందిన దాములూరి వెంకట శివరావు తన ద్విచక్ర వాహనంపై తెలంగాణకు చెందిన సుమారు రూ.64వేలు విలువ చేసే 56 ఫుల్ బాటిళ్లు, 84 క్వార్టర్ బాటీళ్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు వెంకటశివరావుతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.







మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



సత్తెనపల్లి: మట్టి గణనాథుడిని పూజించడం అందరి బాధ్యత అని సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ రఘుపతి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను స్థానిక వేణుగోపాలస్వామి గుడి వద్ద ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని 800 వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, అధ్యక్షుడు మాతంగి సాంబ శివరావు, ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు చందోలు మల్లికార్జునరావు, పాయసం మహేష్‌బాబు, దాతలు కేరళ హోటల్ సెల్వ, ఉపాధ్యాయురాలు పద్మజ, పల్నాడు మీడియా అసోసియేషన్ ప్రతినిధులు సాయిరమేష్, మహబూబ్ సుబాని, గోపి, తుమ్మల వెంకటేష్, మాతంగి రాహుల్ గౌతమ్ పాల్గొన్నారు.







ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ జయంతి వేడుకల్లో సంస్థ సభ్యులు

అచ్చంపేట: స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి పడకండ్ల లక్ష్మాచారి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి రోజునే ప్రధాన నరేంద్రమోదీ జన్మదినోత్సవం కూడా కావడం, దీనిని పరస్కరించుకుని విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించడం చాలా ఆనందదాయకమ్మన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్, విశ్వకర్మ జయంతి



సత్తెనపల్లి: పట్టణంలో ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెరియార్, విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ పెరియార్ రామసామి హేతువాదం, ఆత్మగౌరవం, మహిళల హక్కులు, కుల నిర్మూలన సూత్రాలను ప్రచారం చేశారన్నారు. విశ్వకర్మ ప్రపంచానికి అసలైన సృష్టికర్తగా పిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పత్తిపాటి హరే కృష్ణ, గుంజి విజయ్‌కుమార్, కుమ్మరి దస్తగిరి, షేక్ చిన్న షరీఫ్, తాళ్లూరి అమర్‌నాథ్, ఎరగ్రొర్ల శ్రీనివాస్, చిలకా శ్రీనివాస్, గుంటూరు గోవిందు, గొట్టం వెంకటేష్, ఉప్పతల శ్రీను, నర్రా కృష్ణ పాల్గొన్నారు.

వావిలాలకు ఘన నివాళులు



సత్తెనపల్లి: దేశం కోసం, సమాజ శ్రేయస్సుకు తమ జీవితాలను త్యాగం చేసిన ఎందరో మహానుభావులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలని, వారిలో స్వాతంత్ర్య సమర జ్వాల వావిలాల గోపాలకృష్ణయ్య అని సంజనా వైద్యశాల వైద్యుడు డాక్టర్ జి.శ్రీధర్ అన్నారు. వావిలాల 118వ జయంతిని బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో ఆదివారం నిర్వహించారు. వావిలాల విగ్రహనికి పూలమాలలు వేసి, నివాళ్ళులర్పించారు. బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు కొనంకి మారుతి, ఆదిశైవసంఘ రాష్ట్ర నాయకుడు బెల్లంకొండ నరసింహారావు, కొండ కావూరి మార్కండేయ శర్మ, అర్చక సంఘం నాయకుడు తూమాటి మురళి, విఖనస మండలి అధ్యక్షుడు డాక్టర్ వేదాంతం రామకృష్ణమాచార్యులు, సంఘ సభ్యులు ఆర్కే మూర్తి(గోల్డ్) సంగాపు కామేశ్వర శర్మ, మేడికొండూరు రాజశేఖర్, గుండవరపు అమర్ నాథ్, తదితరులు పాల్గొన్నారు. వావిలాల ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టులో గోపాలకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న మెరిట్ విద్యార్థి జి.యశోదా దేవికి ల్యాప్ టాప్‌ను డాక్టర్ జి.శ్రీధర్ అందించారు. డాక్టర్ రజనీకాంత్, కార్ప్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్, మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు, గీతిక కంప్యూటర్స్ అధినేత విజయ్‌చందు, వెంకట్, దాసరి తిరుపతిరావు, సుబ్బయ్య, విజయ్, తదితరులు ఉన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



సత్తెనపల్లి: ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ నరసింగరావు మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నరసింగరావు మాదిగ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 29 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణకు పోరాటం చేస్తున్నప్పటికీ పాలక, ప్రతిపక్షాలు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. దీక్షా శిబిరంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు మాదిగ, సత్తెనపల్లి కన్వీనర్ జంగాల శ్రీను, ముప్పాళ్ల మండల కన్వీనర్ గుజ్జర్లపూడి అశోక్ మాదిగ, కందుల జార్జి, కంభంపాటి రమేష్, బొక్క పిచ్చయ్య, వడ్లమూడి జగన్నాథం, గద్దెల ఏసుదాసు, నల్లారి రవి పాల్గొన్నారు.

మండపానికి గణనాథుడు

క్రోసూరు: చవితి పూజలందుకునేందుకు గణనాథుడు సిద్ధమయ్యాడు. సోమవారం వినాయక చవితి పండుగ కావటంతో ఆయా గ్రామాల్లో భక్తులు మండపాలు, ఆలయాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలను కొలువు దీర్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటరులో వినాయకుల విగ్రహాలతో సందడి వాతావరణం నెలకొంది. డప్పువాయిద్యాల నడుమ జైబోలో గణేష్ మహరాజ్‌కి..జై అంటూ నినాదాలు చేసుకుంటూ గణనాథులను తరలించారు.

తాడువాయిలో వాహనాల తనిఖీ



అచ్చంపేట: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని నిండు ప్రాణాలు బలవుతాయని అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ అన్నారు. మండలంలోని తాడువాయి వద్ద ఆదివారం ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.









